క్లుప్తంగా

అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం: చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా రాజాం పట్టణంలోని సంతమార్కెట్ వద్ద ఉన్న మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నస మారాధన కార్యక్రమం నిర్వహించారు. రాజాం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. అర్చకులు హరవెల్లి హరనాథ శర్మతో పాటు కల్యాణగౌరీ దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం


వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంతకవిటి: స్థానిక సత్యసాయిబాబా మందిరం వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 40 మందికి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు నేత్రపరీక్షలు చేసి 17 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి, శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారిని పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ యాలాల శ్రీనివాసరావు, సభ్యులు పాట్నూరు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: మానసిక ప్రశాంతత కోసం ధ్యాన మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని డీఎస్పీ భవ్యారెడ్డి అన్నారు.స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఆదివారం విశ్వబంధుత్వ దినోత్సవం నిర్వహించారు. అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితంలో చాలామంది మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ఈ సమస్యను ధ్యానం ద్వారా అధిగమించవచ్చన్నారు. బీకే రాజేశ్వరి అక్క మాట్లాడుతూ విశ్వబంధుత్వ దినోత్సవం ఉద్దేశ్యాలను వివరించారు. ముస్లిం మైనారిటీ ప్రతినిధి ఇంతియాజ్, షిర్డీసాయి ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ, సిస్టర్ జెస్సీ జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి ఉత్సవాలు


శ్రీ కృష్ణుడి విగ్రహం ఊరేగింపులో భక్తులు

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో ఈనెల 16న ప్రారంభమైన శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందుజ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణ పరమాత్ముడికి తొమ్మిది రోజుల పాటు వివిధ పూజలు చేశారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందుజ్ఞానవేదిక సభ్యులు రామునాయుడు, మోహనరావు, గణపతి, సత్యనారాయణ, రామకృష్ణ, అప్పలనరసయ్య తదితరులు పాటు విజయనగరం, మజ్జివలస, విజయరాంపురం, గజపతినగరం, శ్రీకాకుళం, రాయగడ తదితర ప్రాంతాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఏటా తప్పని ముంపు

- సాయన్నచానల్ ఆయకట్టులో నీటిమునుగుతున్న పంటపొలాలు
- ఓ అండ్ఎం పనులు చేసినా పరిష్కారం కాని సమస్య
- నష్టపోతున్న అన్నదాతలు


ఖండ్యాం వద్ద వరద ముంపు వల్ల చనిపోయిన వరిపంట

రాజాం/సంతకవిటి/రేగిడి : రేగిడి, సంతకవిటి మండలాల్లో విస్తరించి ఉన్న సాయన్నచానల్ కాలువ ఆ కాలువ ఆయ కట్టు పరిధి రైతులకు కన్నీటిని మిగుల్చుతోంది. ప్రతీ ఏడాది ముంపు తప్పడంలేదు. సంతకవిటి మండలంలో ఈ ముంపు నష్టం చాలా ఎక్కువగా కనిపిస్తోంది. కాలువకు మదుములు లేకపోవడం, ఎగువన మద్దువలస, నారాయణపురం కాలువలు ఉండడంతో నీరు కాలువలోకి వచ్చి ఉండిపోవడం, ఎగబోటు వల్ల పంటపొలాలు మునిగిపోతున్నాయి.

6 వేల ఎకరాలకు పైగా నష్టం

రేగిడి మండలం సంకిలి, బొడ్డవలస ప్రాంతాలు వద్ద నాగావళి నది నుంచి ఓపెన్ హెడ్ చానల్‌గా ఈకాలువ ఏర్పాటు చేశారు. సంకిలి వద్ద కంట్రోల్ రెగ్యులేటర్లు పూర్తిగా పాడయ్యాయి. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో నదిలో నీటి ప్రవాహం పెరిగితే కాలువ పొంగుతుంది. ఈమండ లంలో మజ్జిరాముడుపేట, అప్పాపురం, లక్ష్మీపురం, ఖండ్యాం, ఆడవరం, కౌమెర గ్రామాల్లో విస్తరించిన ఈ కాలువ అక్కడి నుంచి మాధవరాయపురం వద్ద సంతకవిటి మండలంలోకి వస్తుంది. మాధవరాయ పురం, కొండగూడెం, జావాం, వాసుదేవపట్నం, రామారాయ పురం, షాలీపేట, మంతిన, బూరాడపేట, పనసపేట గ్రామాలకు విస్తరించి, వాల్తేరు వద్ద నాగావళినదిలో కలుస్తోంది. రేగిడి మండలం ఆడవరం, ఖండ్యాం ప్రాంతాలతో పాటు సంతకవిటి మండలంలో మాధవరాయ పురం, కొండగూడెం, రామారాయ పురం, షాలీపేట, బూరాడపేట, మంతిన, చిత్తారిపురం ప్రాంతాల్లో ఈ కాలువ ఆయకట్టులో పంట పొలాలను ఏటా ముంచేస్తోంది. రామారాయపురం- హొంజరాం ప్రధాన రహదారి వద్ద ఈ కాలువ నీరు ఉధృతంగా పొలాల్లో ప్రవహించి పంటలకు నష్టాన్ని కలిగిస్తోంది. కాలువలో నీరు బయటకు వచ్చేందుకు, బయట నీరు కాలువలోకి వెళ్లేందుకు మదుములు లేవు. దీంతో కాలువలో నీటి ప్రవాహం పెరిగితే గట్లుమీదుగా లోతట్టు ప్రాంతాల వద్ద పొలాల్లోకి నీరు చేరిపోతోంది. రేగిడి, సంతకవిటి మండలాల్లో ఈకాలువ పరిధిలో ఖరీఫ్‌లో 13 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుంటారు. ప్రతీ ఏడాది ఇందులో సగం విస్తీర్ణం ముంపునకు గురై రైతన్నలు నష్టపోతు న్నారు.


కొండగూడెం వద్ద పాడైన పంట


రామారాయపురం-హొంజరాం మధ్య నీటమునిగిన పొలాలు


బూరాడపేట సమీపంలో నీట మునిగిన పొలాలు


కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఓఅండ్ఎం పనులు గాలికి

సాయన్నచానల్‌లో సంతకవిటి మండలంలో ఆపరేషన్ అండ్‌మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) విభాగం ద్వారా ఇటీవల పనులు చేశారు. రూ. 60 లక్షల మేర నిధులు మంజూరు కాగా సంతకవిటి మండలంలో మాధవరాయపురం నుంచి వాల్తేరు వరకు కాలువలో పూడిక తొలగించారు. కాలువ గట్టుకు మదుములు లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండ డంతో పలుచోట్ల నీరు పొలాల్లోకి వచ్చేస్తోంది. తూతూ మంత్రంగానే పనులు చేయడంతో నీరు కాలువ ద్వారా నేరుగా నదిలోకి కలవలేక, కలుపు మొక్కలు చేరి ప్రమాదకరంగా మారింది.

మదుములు ఏర్పాటు చేస్తాం..

సాయన్నచానల్ రేగిడి, సంతకవిటి మండలాల్లో విస్తరించి ఉంది. ఓ అండ్ఎం విభాగంలో మంజూరైన నిధులతో సంతకవిటి మండలం పరిధిలో పనులు చేపట్టాం. వరదల సమయంలో పంట పొలాలు మునిగిపోతున్న విషయం వాస్తవమే. కాలువకు మదుములు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, సంతకవిటి సెక్షార్ ఇరిగేషన్ ఏఈ

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటుతున్నామని స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, కార్యదర్శి సప్పటి వసంతరావు తెలిపారు.పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిపోతున్న భూతా పాన్ని తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటడంతోపాటు ప్లాస్టిక్ నివారణకు అంతా కృషి చేయాలని కోరారు. రోటరీక్లబ్ సభ్యులు కొత్తా మధుసూదనరావు, మక్క అప్పలనాయుడు, ఆకిరి రామారావు, బసవరాజు, ఎస్.మోహన్‌రావు, కిషోర్‌కుమార్, శ్రీనివాసరావు, బి.వి.అచ్యుత్‌కుమార్, ఆర్.ఈ.సీ. హెచ్.జయదేవ్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం రోడ్డులో డివైడర్ మధ్యలో మొక్కలు నాటుతున్న రోటరీక్లబ్ సభ్యులు

సెప్టెంబర్ 13,14న జేవీవీ రాష్ట్ర మహాసభలు

బొబ్బిలి: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) 18వ రాష్ట్ర మహాసభలను సెప్టెంబరు 13,14వ తేదీల్లో విజయనగరంలో నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యంనాయుడు,యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయ గౌరి తెలిపారు.మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలో ఆదివారం ఆవిష్కరించారు. అంతకు ముందు జేవీవీ, యూటీఎఫ్, గ్రీన్ బెల్ట్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో మొక్కలు నాటారు. అలాగే మట్టి వినాయక ప్రతిమలను పంచిపెట్టారు. రమణమూర్తి,కృష్ణదాసు,తదితరులు పాల్గొన్నారు.


మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ, యూటీఎఫ్, గ్రీన్‌బెల్ట్ సభ్యులు

పత్రద్రావణాల తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో రైతులకు పత్ర ద్రావణాల తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం అవగా హన కల్పించారు. వేప, కానుగ, ఉమ్మెత్త, జిల్లేడు, మారేడు, వెదురు, వావిల, రావి, మందార, కలబంద, తూటికాడ, తులసి, వెంపల, తదితర ఆకులు సేకరించి రైతుల సమక్షంలో పత్ర ద్రావణాలు తయారు చేశారు. ఈద్రావణాలను పంటలకు పిచికారీ చేయడం వల్ల మొక్కల ఎదుగు దల బాగుంటుందని, శిలీంధ్ర నాసినిగా ఉపయోగపడతాయని ఐసీఆర్‌పీలు కరణం వరలక్ష్మి, పొగిరి లక్ష్మునాయుడు, గుండాల రవి వివరించారు. సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

భాగవత కథల పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు భాగవతంలోని దశమ స్కందం నుంచి కథల పోటీలను ఆదివారం నిర్వహించారు. 140 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో శంబంగి జాహ్నవి, దాసరి మానస, కెంబూరు చాందిని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో టంకాల శృతి, పద్మనాభం పూజిత, ఒడిశా విశాలాక్షి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరితోపాటు రెడ్డి తేజశ్వని, బార్ల ఇషిత కన్సోలేషన్ బహుమతులు పొందారు. న్యాయనిర్ణేతలుగా కె.తిరుమలరావు, జి.శ్రీలక్ష్మి, పి.కృష్ణ, ఎం.గణేష్ వ్యవహరించారు. వికాసతరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, విజయకోదండరామ ఆశ్రమ అధ్యక్షుడు టి.టి.వి రమణమూర్తి, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్‌కుమార్, వికాస తరంగణి సభ్యులు ఇ.శ్రీనివాసరావు, పి.రాంబాబు, టి.శ్రీనివాసరావు, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో వికాస తరంగిణి సభ్యులు

సేవాభావం అలవరుచుకోవాలి


మాట్లాడుతున్న పడాల ప్రసాదరావు

రేగిడి: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరుచుకోవాలని సత్యసాయి ఆధ్యాత్మిక కర్త పడాల ప్రసాదరావు అన్నారు. మండలకేంద్రంలోని విశ్వసాయి మందిరంలో భగవాన్ సత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు సేవా కార్యక్రమాలు, నామ సంకీర్తన, నగర సంకీర్తన వంటి అంశాలను వివరించారు. శ్రీకాకుళం జిల్లా ప్రశాంతి సేవా ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణుమూర్తి, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ఆనందోబ్రహ్మ అకాడమీకి అవార్డు

బొబ్బిలి: విశాఖపట్నం రైటర్స్ అకాడమీ ఆదివారం విశాఖలోని ఉడా చిల్డ్రన్ పార్కులో నిర్వహించిన ఉత్తరాంధ్రస్థాయి కామెడీ స్కిట్స్ పోటీల్లో పట్టణానికి చెందిన ఆనందో బ్రహ్మ అకాడమీ కళాకారుల ప్రదర్శనకు అవార్డు వచ్చిందని అకాడమీ అధ్యక్షుడు మింది విజయమోహన్ తెలిపారు. ఈపోటీల్లో 38 బృందాలు పాల్గొనగా అందులో ఆనందో బ్రహ్మ అకాడమీ బృందం నాలుగోస్థానంలో నిలిచింది. రైటర్స్ అకాడమీ చైర్మన్ కళాకారులకు అవార్డుతో పాటు రూ.5 వేల నగదు,జ్ఞాపికలు అందజేశారు. కళాకారులు టి.వెంకటరమణ,బి.తన్మయి, ఏ.నళిని తదితరులను ఆనందో బ్రహ్మ అకాడమీ అధ్యక్షుడు విజయమోహన్ అభినందించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసు లు దాడి చేశారు. ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాలు.. పెరుమాళి గ్రామ శివారులో పేకాట శిబిరం నడుస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని చెప్పారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.వారి వద్ద నుంచి రూ. రూ.30,100 నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని కలవరాయి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమ వారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ బి.రఘు ఆది వారం ఓ ప్రకటనలో తెలిపారు. కలవరాయి విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట ల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బొబ్బిలిరూరల్/బాడంగి: రేషన్ లబ్ధిదారులకు సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు బొబ్బిలి, బాడంగి తహసీల్దార్లు ఎం.శ్రీను,కె.సుధాకరరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి రేషన్ కార్డులు అందజేస్తారని పేర్కొన్నారు.పంపిణీ అనంతరం సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ డీలర్లు ఈ-పౌరసరఫరాల యాప్‌లో లబ్ధిదారుల వివరాలు, బయోమెట్రిక్ నమోదు పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం


మట్టి గణపతివిగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ హితం మట్టి గణపతి ప్రతిమల నే పూజించాలని డీఎస్పీ జి.భవ్యారెడ్డి సూచించారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎస్పీ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరమన్నారు. రోటరీక్లబ్ క్లబ్ అధ్యక్షుడు వారణాసి శ్రీహరి, కార్యదర్శి శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు అంతా సహకరించాలి

రాజాం సిటీ: కాలుష్య నివారణకు అంతా సహకరించాలని పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు కోరారు. పట్టణంలోని వైఎస్సార్ పార్కు, భగీరథ డిపార్ట్‌మెంట్ స్టోర్స్, సీతారామథియేటర్ వద్ద వాసవీక్లబ్ మనరాజాం-సారథి సభ్యులు ప్రజలకు ఆదివారం ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు, పుస్తకాలు పంపిణిచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కోరారు. వాసవీ క్లబ్ మన రాజాం-సారథి సభ్యులు గ్రంధి రవికుమార్, వి.అంబరీస్, యు.ధనుంజయ్, వి.చంటి, పి.సత్యనారాయణ, పెంకి చైతన్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.


రాజాం సిటీ: వినాయకప్రతిమలను పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి, వాసవి క్లబ్ సభ్యులు

యూరియా పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్టవేయాలి

- మండాకురిటి ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేయాలి
- జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్ రావు


మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు


వీఏఏ కుసుమను నిలదీస్తున్న సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు

సంతకవిటి: యూరియా పంపిణీలో కూటమి నేతలు పాల్పడుతున్న అక్రమాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్ రావు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండాకురిటి రైతు సేవా కేంద్రంలో టీడీపీ నాయకులు శనివారం దౌర్జన్యంగా, తమ అనుచరులకు యూరియా పంపిణీ చేపడితే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక వీఏఏ కుసుమ శనివారం విధులకు ఆలస్యంగా రావడమే కాకుండా, టీడీపీ నాయకులకు ముందుగానే రైతు సేవా కేంద్రం తాళాలు ఇచ్చేయడంతో వారు నిబంధనలకు పాతరేసి తమ అనుచరులకు ఇష్టారీతిగా యూరియా పంచిపెట్టారని ఆరోపించారు. టీడీపీ నాయకులు దౌర్జన్యంగా యూరియా పంపిణీ చేస్తున్న విషయం తెలుసుకుని స్థానిక సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు అక్కడికి వచ్చే సరికే 450 బస్తాల్లో 70 శాతం మేర తరలించేశారని అన్నారు. యూరియా మొత్తం ఖాళీ అవుతున్న సమయానికి వీఏఏ వచ్చారని, టీడీపీ నాయకులకు సహకరించేందుకు ఆమె విధులకు ఆలస్యంగా వచ్చారని ఆరోపించారు. ఎరువుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్న సమాచారం అందుకున్న ఏఓ యశ్వంత్‌రావు అక్కడికి వచ్చే సరికి సుమారు 50 యూరియా బస్తాలు మాత్రమే మిగిలి ఉన్నాయని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు ఇంత దౌర్జన్యం చేసినా స్థానిక వీఏఏ కాని మండల వ్యవసాయ అధికారి కానీ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, తప్పు చేసిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలతో సంబంధం లేకుండా రైతులందరికీ ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేసేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం చేత కాని తనం వల్ల రైతులు ఈరోజు ఎరువుల కోసం రోడ్డెక్కాల్సి వస్తోందని, యూరియా బస్తాపై రెండు నుంచి మూడొందల రూపాయలు అధికంగా చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని అన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు తదితరులు

తెర్లాం: మహిళలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శంకరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏటా రూ.10వేలు సహాయం అందించేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నుంచి సాయం అందకపోగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లంతా కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెర్లాం, పణుకువలస, పెరుమాళి, నెమలాం ఆటో స్టాండ్ల యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.